ప్రజాశక్తి
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 5
అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకోసం పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 47వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలకు ప్రోత్సహం అందించాలన్నారు. పారిశ్రామికవాడల్లో పరిశ్రమలకు కేటాయించిన స్థలాల్లో పరిశ్రమలు నేలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా రాప్తాడులో స్థాపించబడే యూనిట్ల ప్రగతి నివేదికను సమర్పించాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ని ఆదేశించారు. సమావేశంలో జిల్లాలో ఏర్పాటు చేసే పలు పరిశ్రమల యూనిట్లకు ఆమోదం తెలిపారు. ఇక ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంపై విస్తతంగా అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జి.నాగరాజ రావు, ఎపిఐఐసి జెడ్ఎం సోనీతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణ సమీపంలోని బిటిపి రోడ్డులో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్

- రాయదుర్గంలో యథేచ్ఛగా అనధికారిక లేఅవుట్లు
- ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు
- 'అధికారం' అండతో రెచ్చిపోతున్న రియల్టర్లు
- జోరుగా క్రయవిక్రయాలు
- పట్టించుకోని అధికారులు

నిబంధనలకు పాతర..అక్రమాల జాతర..!

రాయదుర్గం పట్టణ పరిసరాల్లో అక్రమ లేఅవుట్ల జాతర కొనసాగుతోంది. రియల్టర్లు నిబంధనలను తుంగలో తొక్కేసి యథేచ్ఛగా క్రయవిక్రయాలు చేసేస్తున్నారు. పట్టణ పరిసరాల్లో అన్నివైపులా అక్రమ లేఅవుట్లు వెలిశాయి. గతంలో ఉన్న వాటికి తోడు కొత్తవీ ఏర్పాటు అవుతున్నాయి. అక్రమ లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లేఅవుట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం, అధికారుల నుంచి అనుమతులు లేకున్నా రియల్టర్లు వాటిని వేసేస్తున్నారు. అధికారం అండదండలతో కొందరు అధికారులను చెప్పుచేతుల్లో పెట్టుకుని అక్రమ లేఅవుట్ల వ్యవహారాన్ని కానిచ్చేస్తున్నారు.

ప్రజాశక్తి-రాయదుర్గం

జాతీయ రహదారి- 544డి రాయదుర్గం మీదుగా వెళ్తోంది. ఇది ఏర్పడిన తరువాత రోడ్డుకు అనుకున్న ఉన్న స్థలాలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా రియల్టర్లు అనధికారి వెంచర్లను యథేచ్ఛగా వేసేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఒకప్పుడు వ్యవసాయ పొలాలుగా ఉన్న భూములు ఇప్పుడు వెంచర్లతో దర్శనమిస్తున్నాయి. రాయదుర్గం పట్టణంలోని కోతిగుట్ట, జాతీయ రహదారికి ఇరువైపులా 74-ఉడేగోళం గ్రామం, పైతోట, బిటిపి రోడ్డుకు ఇరువైపులా, కనేకల్ రోడ్డు, ఇందిరమ్మ ఇళ్లు, జగనన్న కాలనీలు, కొండగుట్టల వద్ద అనేక అనధికారిక లేఅవుట్లు వెలిశాయి. రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో కొత్తగా ఎటువంటి లేఅవుట్లూ మంజూరు కాలేదు. దశాబ్దాల క్రితమే లేఅవుట్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. లేఅవుట్ ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు 80 అడుగుల ప్రధాన రహదారి, 40 అడుగుల అంతర్గత రోడ్లు, 15 శాతం ఖాళీ స్థలాన్ని ఉంచాలి. వీటితోపాటు కాలనీ యజమానులు కాలనీ అభివద్ధి కోసం రోడ్లు మురికి కాలువలు విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్ల ఏర్పాటు మొదలైన వాటికోసం నిర్ణీత సొమ్మును డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్లాట్లు కూడా నిర్దేశించిన కొలతలతోనే ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్నవి కావడంతో ప్లాట్ల యజమానులు ముందుగా పొలం యజమానితో ధర మాట్లాడుకుని కొంత అడ్వాన్స్ చెల్లించి లేఅవుట్ ఏర్పాటును ప్రారంభిస్తారు. వారికి నచ్చిన వెడల్పుతో నామమాత్రంగా రోడ్డును వదిలి, వారికి అనువైన కొలతలతో ప్లాట్లు వేసి రాళ్లను పాతుతారు. కంప్యూటరైజ్డ్ లేఅవుట్ మ్యాప్‌ను తయారుచేస్తారు. దాన్ని చూపించి లేఅవుట్ జాతీయ, ప్రధాన రహదారులకు చాలా దగ్గరగా ఉందని, వేగంగా అభివద్ధి చెందుతుందని, చౌక ధరలకే ప్లాట్లను విక్రయిస్తున్నట్లు ప్రచారం చేస్తూ విక్రయాలు ప్రారంభిస్తున్నారు. ఇక రియల్ ఎస్టేట్ దళారులు రంగంలో దిగి స్థలాలు కొనే వారిని ప్రలోభపెట్టి అధిక ధరలకు ప్లాట్లను కొనుగోలు చేయిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ కొందరు దళారులను ఏర్పాటు చేసుకుని వారి చేత రిజిస్ట్రేషన్లను త్వరితగతిని చేయించేస్తున్నారు. అక్రమ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వకుంటే దళారులు ప్రజాప్రతినిధుల సాయంతో దొడ్డిదారిని అనుమతులు తెచ్చేస్తున్నారు. ఇలా నిర్మాణాలు చేస్తున్న వాటిని అధికారులు కనీస పరిశీలించకుండా కొళాయి, విద్యుత్ తదితర కనెక్షన్లకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఈ అనుమతుల నిమిత్తం గహ నిర్మాణదారుడు ఆయా శాఖలకు అదనంగా పెద్ద మొత్తంలోనే డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది.

రాయదుర్గం పట్టణ సమీపంలోని కోతిగుట్ట వద్ద ఏర్పాటు చేసిన అనాధికార లేఅవుట్

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమ లేఅవుట్లతో ప్రభుత్వా దాయానికి పెద్ద మొత్తంలోనే గండిపడుతోంది. ప్రభుత్వానికి రావాల్సిన రిజిస్ట్రేషన్ సొమ్ము, అభివద్ధి ఫీజు, రిజర్వు స్థలం తదితరం రావడం లేదు. లేఅవుట్లలో గృహాలకు అవసరమైన రోడ్లు, మురికికాలువలు, వీధిదీపాలు, కొళాయి కనెక్షన్లు, ఇతర ప్రజా అవసరాలను ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులూ తలెత్తుతున్నాయి. రాయదుర్గం పురపాలక సంఘంలో ఇదివరకు పనిచేసిన కమిషనర్ బదిలీ కాగా కొత్తగా చేరిన కమిషనర్ అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్ పోస్ట్ దీర్ఘకాలంగా ఖాళీగా ఉంది. కళ్యాణదుర్గం పురపాలక సంఘం టిపిఎస్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం కిందిస్థాయి అధికారులు కూడా లేకపోవడంతో అనధికారిక లేఅవుట్లపై పట్టించుకునేవారు కరువయ్యారు. ఇప్పటికైనా పట్టణ ప్రణాళిక విభాగం రాయదుర్గంలో జరుగుతున్న అక్రమ లేఅవుట్ల వ్యవహారంపై దృష్టి సారించి, వాటికి అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయి..

భూములు, ప్లాట్ల క్రయవిక్రయాలకు నిర్ణీత రుసుం చెల్లిస్తే రిజిస్ట్రేషన్లు చేసేలా తమ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు తాము రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నాం.

శ్రీనివాసులు, సబ్‌రిస్ట్రార్.

సమస్యల పరిష్కారానికి మెరుపుసమ్మె

- 12న కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందిస్తాం
- ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం నాయకులు

ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏపీ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో మెరుపు సమ్మెకు సిద్ధమైనట్లు ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.చంద్రమోహన్ తెలిపారు. గురువారం నాడు ఎన్జీవో హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని కారనంగానే మెరుపు సమ్మెలోకి వెళ్లాల్సి వస్తోందన్నారు. 12వ పిఆర్‌సి వేసి ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు ప్రకటించకపోవడం సరికాదన్నారు. పిఆర్‌సి ప్రకటించాలని, సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బాకాయిలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. క్వాంటమ్ పెన్షన్ పెంచాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయక తప్పలేదన్నారు. ఈ నెల 11వ తేదీ నిర్వహించే జేఏసీ సమావేశంలో ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. 12వ తేదీన చీఫ్ సెక్రటరీకి, జిల్లా కలెక్టర్లకు సమ్మె నోటీసు అందజేస్తామన్నారు. 14వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వివిధ దశల్లో ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జమీలాబేగం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీలు శోభారాణి, మహేష్, నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల అమలు తప్పనిసరి

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

సెక్టార్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని పూర్తిగా అమలు చేయాలని ఆర్డీవో రాణిసుస్మిత, డీఎస్పీ బీసీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెక్టార్ అధికారులకు ఎన్నికల విదులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటఫర్ ఓపీఎస్ పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఓపీఎస్ అమలు చేసే వారికే ఓటేద్దాం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఓట్‌ఫర్ ఓపీఎస్ పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాబోయే ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేసే పార్టీలకే ఓటు వేద్దామని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య తెలిపారు. గురువారం నాడు రాప్తాడు ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన ఓట్‌ఫర్ ఓపిఎస్ పోస్టర్‌లను మండల విద్యాశాఖ అధికారులు మల్లికార్జున, కుళ్లాయప్ప, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్యల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే సాధారణ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులను దృష్టిలో పెట్టుకుని పాత పెన్షన్ విధానం అమలు చేసేలా ఆయా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలన్నారు. అధికారంలోకి రాగానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ స్థానంలో తీసుకొచ్చిన జిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి పాత పెన్షన్ విధానం వారికి కూడా అమలు చేయాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు. ఆ పార్టీలకే తమ ఓటు ఉంటుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాప్తాడు మండల అధ్యక్షుడు బి.గంగాధర్ ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటనాయుడు, నాయకులు చంద్రారెడ్డి, రాజకుళ్లాయప్ప పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సూర్యనారాయణ

వర్ధంతి కార్యక్రమంలో సిఐటియు నాయకులు

అనంతపురం : సిఐటియు నాయకులు సూర్యనారాయణ చిరస్మరణీ యుడని వక్తలు కొనియాడారు. సిఐటియు నాయకులు సూర్యనారాయణ నాలుగో వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. సూర్యనారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ సూర్యనారాయణ ఉద్యోగిగా ఉంటూనే జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకంగా పనిచేసారని గుర్తు చేశారు. సిపిఎం పునర్నిర్మాణంలో ఆయన ఎంతగానో కృషి చేసారని కొనియాడారు. చివరివరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడి పోరాడిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ సూర్యనారాయణ చివరివరకు ప్రజా సమస్యల పోరాటంలో నిమగ్నం అవడమే కాకుండా తన కుటుంబాన్నీ అదే బాటలో నడిపించారని గుర్తు చేశారు. ఖచ్చితత్వం, నిబద్ధతతో పనిచేయడంలో ఆయన మార్గదర్శకులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, రిటైర్డు తహశీల్దారు జయరామప్ప తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ఎన్నికల్లో 'అభివృద్ధి' అజెండా కావాలి

- 'జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' పుస్తకావిష్కరణలో వక్తలు
- సిపిఎం ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

'జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు

'రాబోవు ఎన్నికల్లో జిల్లా సమగ్రాభివృద్దే ప్రధాన అజెండాగా ఉండే విధంగా చూడాల్సిన అవసరముంది' అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై రూపొందించిన పుస్తకాన్ని గురువారం నాడు ఆవిష్కరించారు. నగరంలోని స్థానిక ఎన్జీవో హోంలో ఈ కార్యక్రమం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన జరిగింది. పుస్తకావిష్కరణ అనంతరం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో వ్యవసాయం, పారిశ్రామికరంగం, సేవారంగాలు ప్రధానమైనవన్నారు. ఈ రంగాల న్నింటిలోనూ అనంతపురం జిల్లా అత్యంత వెనుకబడి ఉందని చెప్పారు. ప్రభుత్వ విధానాలు, ప్రపంచీకరణ మూలంగా వచ్చిన కొన్ని అవకాశాలు సంపన్నులను మరింత సంపన్నులు చేయగా, పేదలను మరింత పేదరికంలోకి నెట్టాయని చెప్పారు. పేదరికంలో, దారిద్ర్యంలో మగ్గుతున్న వారి బాధలను వచ్చే ఎన్నికల్లో ప్రధాన ఏజెండా చేయాలని సిపిఎం చేసిన ఈ కృషి అభినందనీయమన్నారు. మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి అంటే రహదాలు వేయడం, బ్రిడ్జిలు నిర్మించడమేనన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. పేద ప్రజల జీవన ప్రమాణాల మెరుగుపడటం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమని చెప్పారు. పేదరికం మూలంగా ఉన్నత విద్యను అభ్యసించలేక అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేస్తున్న పరిస్థితులున్నాయని విచారం వ్యక్తం చేశారు. అందు మూలంగా ప్రధాన విద్యా సంస్థలన్నింటిలోనూ సీట్లు ఖాళీగా ఉంటున్నా యన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగితే ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య పెరుగు తుందన్నారు. తద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. సాగునీటి రంగ నిపుణులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ మాయమాటలు మోసపూరితమైన వాగ్దానాలను జిల్లావాసులను పాలకులు మభ్యపెడుతున్నారన్నారు. సాగునీట రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయనున్నట్లు విమర్శించారు. జిల్లాకు ప్రధాన సాగునీటి వనరులైన హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రెండూ నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. సామాజికవేత్త సత్యబోసు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పట్టించుకునే పాలకులు కరువయ్యా రన్నారు. పాలకుల దృష్టి ప్రజా సమస్యలపై మళ్లాలంటే ప్రజాపోరాటాన్ని చేపట్టాల్సి ఉందన్నారు. ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు తీసుకొచ్చే విధంగా ఈ ఒత్తిడి ఉండాలని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజాసమస్యలను ఈ ఎన్నికల్లో అజెండాగా ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం సిపిఎం చేస్తోందన్నారు. గతేడాది నవంబరు నుంచి జిల్లా సమగ్రాభివృద్ధిపై వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల సమయంలోపు కూడా ఈ పోరాటాన్ని సాగించే ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన ఈ జిల్లాలో వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టివేయబడిందన్నారు. వలసలు వెళితేగాని జీవనం సాగించలేదని పరిస్థితులు న్నాయని విచారం వ్యక్తం చేశారు. ఉపాధి కల్పించే పరిశ్రమలూ లేవని చెప్పారు. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజా సమస్యలు ప్రదాన అజెండాగా మార్చే ప్రయత్నం సిపిఎం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ గోవింద రాజులు, లలిత కళపరిషత్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, మాజీ సైనిక ఉద్యోగుల నాయకులు షేకన్న, రిటైర్డు తహశీల్దారు జయ రామప్ప, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ వీరభద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు దుర్గం విద్యార్థులు

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కళ్యాణదుర్గం నార్త్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిబాయి తెలిపారు. బాలుర విభాగంలో ఉదయ్ కుమార్, ఆకిర, వెంకటేశులు, బాలికల విభాగంలో సమీరాలు ఈనెల 7వ తేదీన శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రతిభ చూపిన విద్యార్థులను పీడీ కిరణ్ చౌదరి, ఉపాధ్యాయులు నున్న వెంకటేశులు, శివన్న, ప్రవీణ్, రామచంద్ర, నాగరాజు, రఘు, కిష్టప్ప, కృష్ణారెడ్డి, పద్మావతిలు అభినందించారు.

రోడ్ స్కేటింగ్‌కు సహకారం అందిస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రోడ్ స్కేటింగ్ చేసే విద్యార్థులతో కలెక్టర్ గౌతమి

తాడిపత్రికి చెందిన స్వామి రమణ మహర్షి అనాథశ్రమ విద్యార్థులు చేపట్టిన రోడ్ స్కేటింగ్ కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో తాడిపత్రి పట్టణానికి చెందిన స్వామి రమణ మహర్షి అనాథాశ్రమంలో చదివే విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. అనాథాశ్రమ విద్యార్థులు జిల్లాలో 750 కిలోమీటర్ల పాటు రోడ్ స్కేటింగ్ చేయాలనుకోవడం అభినందనీయం అని, దీనికి అన్ని విధాలా సహకారం అందిస్తామని కలెక్టర్ చెప్పారు. రమణ మహర్షి అనాథాశ్రమం సెక్రటరీ రమణ మహేష్, స్కేటింగ్ కోచ్ బి.మధు మాట్లాడుతూ తమ ఆశ్రమానికి చెందిన 7 మంది జిల్లాలో ఆగకుండా 750 కిలోమీటర్లు రోడ్ స్కేటింగ్‌ను ఈనెల 12వ తేదీన ఉదయం 5 గంటలకు తాడిపత్రిలో మొదలు పెడతారన్నారు. తాడిపత్రి నుంచి గుత్తి, గుంతకల్, ఉరవకొండ, అనంతపురం, లేపాక్షి, హిందూపురం, మడకశిర, ధర్మవరం మీదుగా తిరిగి తాడిపత్రికి రోడ్ స్కేటింగ్ చేసుకుంటూ వస్తారన్నారు. "ఆడపిల్లలను చదివిద్దాం - ఆడపిల్లలను రక్షిద్దాం", "ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం - భూగర్భ జలాలను కాపాడుకుందాం", "అనాథలను ఆదరిద్దాం - బాల కార్మికులను నిరోధిద్దాం" అనే నినాదాలతో రోడ్ స్కేటింగ్ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ సౌత్ జోన్ సెక్రటరీ బి.ప్రతాప్, విద్యార్థులు ఇషాక్, యోగేంద్ర, పథ్వీ, రామ్ చరణ్, భార్గవ, శ్రీరామ్, తరుణ్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడంలో కార్పొరేషన్ అధికారులు విఫలమయ్యారని, తక్షణమే అలాంటి కట్టడాలపై చర్యలు తీసుకోవాలని టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి జెఎం.బాషా డిమాండ్ చేశారు. గురువారం టిడిపి అర్బన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుత్తి రోడ్డులోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా 80 అడుగుల రోడ్డులో అక్రమ నిర్మాణం చేపట్టారన్నారు. ఈ భవనంపై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌ని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ మాటలను బేఖాతరు చేస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణానికి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ ఈ అక్రమ నిర్మాణంపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి మల్లికార్జున పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఎస్‌కెయు పరిధిలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్కే యూనివర్సిటీ పరిధిలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఉపకులపతి హుస్సేన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్, వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, వంశీ మాట్లాడుతూ గత విసిల నిర్లక్ష్యం, నియంతృత్వ ధోరణితో విశ్వవిద్యాలయం సమస్యల నిలయంగా మారిందన్నారు. వర్సిటీ హాస్టల్‌లో సమస్యలు, లైబ్రరీలో పుస్తకాల కొరత, డిగ్రీ, పీజీ విద్యార్థులకు మూల్యాంకనం సమస్యలు, పోటీ పరీక్షలకు పుస్తకాలు, ప్రస్తుత విద్యా విధానానికి సంబంధించిన కోర్సులు, కనీస సౌకర్యాలు లేకపోవడం, తదితర సమస్యల వల్ల యూనివర్సిటీలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. 2016లో డిగ్రీ జాయిన్ అయిన 4,600మంది విద్యార్థులు అప్పటి సెమిస్టర్ విధానంతో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారని వారికి మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నా రు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు, మెయింటెనెన్స్ ఏర్పాటు చేయాలని, పరీక్షల ఫీజులు తగ్గించాలని, పోటీ పరీక్షలు, ఇంగ్లీష్‌కు సంబంధించిన కోచింగ్, పుస్తకాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీ విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించాలని, న్యాయశాస్త్రం పరీక్ష ఫలితాలు ఆన్‌లైన్‌లో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్కేయు కమిటీ నాయకులు శివ, శ్రీనివాస్, రవి, మోహన్, సండే, బండేష్, చంద్రనాయక్, మహేష్ పాల్గొన్నారు.

విసి హుస్సేన్‌రెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ వినతి

విసి హుస్సేన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మెరుగైన వైద్య సేవలందించాలని ధర్నా

ప్రజాశక్తి-ఉరవకొండ

చికిత్స కోసం వచ్చే ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రోగుల పట్ల ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్లు దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులను సక్రమంగా నిర్వర్తించకపోగా రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పేరుకే 50 పడకల ఆసుపత్రి అని, చాలా వరకూ పరికరాలు, మందులు లేవని, కుక్క కాటు వేస్తే సిరంజీ కూడా బయట తెచ్చుకోవాలని సూచిస్తారని మండిపడ్డారు. మధ్యాహ్నం 12:30 గంటలకే ఓపి చూడటం లేదన్నారు. ఇదంతా ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. డిసిఎస్-ఎస్ సందర్శించడానికి రాగా సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి ఆయా విషయాలను ఆయనకు వివరించారు. వాటిపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శీనప్ప, మురళి, వీరాంజనేయులు, వెంకటేశులు, రవికుమార్, ఎర్రిస్వామి, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను సన్మానిస్తున్న డీలర్లు

నూతన తహశీల్దార్‌కు సన్మానం

పామిడి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ చౌక దుకాణం డీలర్లు నూతన తహశీల్దార్ వి.చంద్రశేఖర్‌నాయక్‌ను శాలువా, పూల మాలతో సన్మానించారు. కార్యక్రమంలో బికె.అన్వర్, అబుసాలెహా, శివ, రాజు, రమణ, రజాక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో రన్నర్ అవార్డు

రాయదుర్గం : పట్టణంలోని నారాయణ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న జి.ఆదిత్య ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి అవార్డ్ గెలుచుకున్నాడు. అంతకు ముందు చిత్రదుర్గలో జరిగిన స్టేట్ లెవెల్ అబాకస్‌లో పోటీల్లో సూపర్ ఛాంపియన్ అవార్డ్ గెలుచుకున్నాడు.

జి.ఆదిత్య

వాయిద్య కళాకారులకు గుర్తింపుకార్డులు

అనంతపురం : నగరంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో గురువారం ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన 70 మంది నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులకు ఎపి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసులు, యల్లనూరు ప్రసాద్ సమక్షంలో గుర్తింపు కార్డులు అందజేశారు.

చౌకదుకాణాల్లో తనిఖీలు

అనంతపురం : విజిలెన్స్ సిఐ కె.శ్రీనివాసులు, ఎఇ జె.వాసుప్రకాష్, తాడిపత్రి సిఎస్‌డిటి కె.రాజా గురువారం చౌకధాన్యం దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. తాడిపత్రి మండలంలోని రావివెంకటాం పల్లి గ్రామం లో సి.నాగమణి భర్త సాయిక్రిష్ణ, పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట గ్రామంలో కె.సుబ్బలక్ష్మి, భర్త కె.నాగార్జున రేషన్ షాపులను తనిఖీ చేసి నిల్వల్లో తేడాలను గుర్తించారు. అధికంగా ఉన్న నిత్యావసర సరుకులను సీజ్ చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించి కేసు నమోదుచేశారు.

ఆర్టీసీ సిబ్బందికి వైద్యపరీక్షలు

రాయదుర్గం : ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న సిబ్బందికి గురువారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. డిపో మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది ఆరోగ్యం గా ఉంటే ప్రజలకు రవాణా సేవలు మెరుగ్గా అందుతాయన్నారు. సిబ్బందికి బుక్‌లెట్ ఇస్తున్నామని, ఇది తీసుకెళ్తే ప్రభుత్వాసుపత్రిలో సకాలంలో వైద్య సేవలు అందుతాయన్నారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ వీరేష్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిఎం సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు తెలుసుకోవాలన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి అన్నదానం చేశారు. రమణిబాబా జయంతి సందర్భంగా ట్రస్ట్ సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీవాణి, గురుప్రణీత్‌రెడ్డి, అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కవిన్‌ఆదిత్య, సుబ్బారావు, సౌధామణి, జగన్నాథ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

ఆత్మకూరు : మండలంలోని సింగంపల్లి తండాలో గురువారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పర్యటించి ప్రజలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో శ్మశానవాటిక, తాగునీటి, విద్యుత్ సరఫరా, ఒహెచ్‌ఎస్‌ఆర్‌ను గ్రౌండ్ చేసి త్వరగా ఏర్పాటు చేయాలని, నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని ఆయన అధికారులకు సూచించారు. ఉపాధి హామీ, హౌసింగ్, పాఠశాల, హాస్పిటల్, అంగన్వాడీ, తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, తహశీల్దార్, ఎంపిడిఒ, సర్పంచి, ఎంపిటిసి ఉన్నారు.

వడిత్యా శంకర్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

సోలార్, స్పాంజ్ ఐరన్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి : 'మెట్టు'

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో మెగా సోలార్, స్పాంజ్ ఐరన్ ప్లాంట్లు ఏర్పాటు చేయించి వేలాది మందికి ఉపాధి కల్పిస్తామని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హామీ ఇచ్చారు. ఈ నెల 18వ తేదీ రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న 'సిద్ధం' సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మెట్టు నివాసం వద్ద గురువారం పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి అధ్యక్షతన మండల స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. మెట్టు మాట్లాడుతూ జగన్‌ను మరోమారు సిఎం చేసుకోవడానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను సంపాదించాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదన్నారు. తనను గెలిపిస్తే వెదురు పంట సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేలా క్షేత్రస్థాయి పర్యటనలు ఏర్పాటు చేయిస్తానన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జడ్పిటిసి మల్లికార్జున, నాయకులు కుమారస్వామి, నాగరాజురెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డి, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

సుజలాన్ విండ్ పవర్ ఇంజినీర్ల బదిలీలను ఆపాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

సుజలాన్ విండ్ పవర్ గాలిమరలలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలని డిజిహెచ్‌ఎస్‌ఎస్ అధ్యక్షులు గోపాల్ కోరారు. ఈ మేరకు గురువారం అనంతపురంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ లక్ష్మీనరసయ్యని వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ వజ్రకరూరు మండలంలో ఉన్న సుజ లాన్ విండ్ పవర్ కంపెనీలో పనిచేస్తున్న ఇంజినీర్లను ఉన్నఫలంగా గుజరాత్‌కు బదిలీ చేయడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బదిలీలను నిలుపుదల చేయడంతో పాటు వారి సమస్యలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా నాయకులు లత్తవరం చంద్రశేఖర్, మురళి, రాము పాల్గొన్నారు.

డిప్యూటీ లేబర్ కమిషనర్ లక్ష్మీనరసయ్యకు వినతిపత్రం ఇస్తున్న గోపాల్

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి పద్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశానికి 15 మంది ఎంపిటిసిలు, 19 మంది సర్పంచులు, మండల అధికారులు హాజరయ్యారు. నిధులు వినియోగించిన విధానం, నాడు-నేడు నిధులపై సభ్యు లు అధికారులను ప్రశ్నించారు. ఐసిడిఎస్ అధికారి ఐదేళ్లలో ఓ సారి కూడా హాజరుకాలేదని, తద్వారా అంగన్వాడీల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, విద్యుత్, ఉపాధి, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, ఆర్టీసీ, పోలీస్, హెచ్‌ఎల్‌సి అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతి నిధులు అధికారులను నిలదీశారు. వచ్చే సమావేశానికి అధికారులు రాకపోతే తాము రామని ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. వివిధ శాఖలకు సంబంధించి సభ్యులు సమస్యలను లేవనెత్తారు. సమావేశంలో హౌసింగ్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, విద్యాధికారి ఈరన్న, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ మల్లేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆశా డేపై గురువారం రాకెట్ల పిహెచ్‌సిలో వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై డాక్టర్ పావని సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో 1 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఎవరికైనా వేయకపోతే 16వ తేదీ వేయాలన్నారు. చేతులశుభ్రత, గోర్లు కత్తిరించుకోవడం, మరుగుదొడ్ల వినియోగంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి.షఫీ, సూపర్వైజర్లు శేఖర్, స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ ఎన్.వెంకటేశ్వర్లు, ఎఎన్ఎం సిఐ.భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పావని

ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నూతన కమిటీ ఏర్పాటు

నార్పల : సమాజంలో రుగ్మతలపై ప్రతిఒక్కరూ ప్రశ్నించిన నాడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని 'ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక' జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అల్తాఫ్ పేర్కొన్నారు. స్థానిక తిక్కయ్యస్వామి గుడిలో గురువారం వేదిక మండల అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించగా అల్తాఫ్‌తో పాటు ఉపాధ్యక్షులు ఎం.సుబ్బరాయుడు, కోశాధికారి ఎం.సాంబశివుడు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షు లుగా జి.సుబ్బయ్య, అధ్యక్షులుగా బి.శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులుగా వై.వెంకటనారాయణరెడ్డి, పి.పోలయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసులు, కోశాధికారిగా షేక్ దాదావలి, కార్యవర్గ సభ్యులుగా కేశవ, మరో ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 25వ తేదీ నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బ్రహ్మోత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం

పెద్దపప్పూరు : ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం ఇఒ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఎంపిడిఒ, ఆర్టీసీ అధికారులు పాల్గొని బ్రహ్మోత్సవాల్లో విద్యుత్, పారిశుధ్యం, చాగల్లు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎఇ నరసింహులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

నార్పల : ప్రభుత్వ స్థలాలు పొందిన లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ రాముడు పరిశీలించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాలు లబ్ధిదారుల పేర్ల మీద స్థానికంగానే సచివాలయా ల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, ప్రభుత్వ స్థలం పొందిన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మేజర్ పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి అశ్వర్థనాయుడు పాల్గొన్నారు.

'రుక్మిణీకళ్యాణం' పోస్టర్ ఆవిష్కరణ

అనంతపురం : ఈ నెల 18వ తేదీ నగరంలోని జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న శ్రీసాయి కష్ణ ఫంక్షన్ హాలులో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రుక్మిణీ కళ్యాణం' పోస్టర్‌ను గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయికుమార్ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు 87123 45520, 96667 56921 నంబర్లలో సంప్రదించాల న్నారు. కార్యకమంలో ట్రస్ట్ సభ్యులు నారాయణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష సమావేశం

బెళుగుప్ప : స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో గురువారం ఉపాధి హామీ పనులపై టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు సుబ్బరాజు, భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఎఇ శివారెడ్డి మాట్లాడుతూ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు లేబర్ రిపోర్టింగ్, వంద రోజులకు దగ్గరగా ఉన్న కుటుంబాలకు పనులు కల్పించి వంద రోజులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణిసుస్మిత

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పేదలకు వరం : ఆర్డీవో

కుందుర్పి : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించడం పేదలకు వరం అని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. ఆమె గురువారం కుందుర్పి సచివాలయాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్ల ప్రకియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా జగనన్న లేఔట్‌లో నివా సం ఉన్న ప్రతి మహిళకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించడం హర్షణీయమన్నారు. కార్యక్ర మంలో తహశీల్దార్ హనుమంతు, డిప్యూటీ తహశీ ల్దార్ తిప్పేస్వామి, విఆర్‌ఒలు అజిత్‌కుమార్, సంజీవరెడ్డి, అశోక్, నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, నవీన్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ కోర్సులపై అవగాహన

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం శ్యామలకృష్ణ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల మదనపల్లి వారి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వ్యవసాయ శాఖ కోర్సులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ కళాశాల ప్రిన్సిపల్ శశివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి తర్వాత డిప్లొమా ఇన్ అగికల్చర్(రెండేళ్లు), సీడ్ టెక్నాలజీ(రెండేళ్లు), అగ్రికల్చర్ ఇంజినీరింగ్(మూడేళ్లు) కోర్సులు చేయవచ్చన్నారు. తద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒల సమావేశం

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపిడిఒ దస్తగిరి, ఎస్‌ఐ హేమాద్రి ఆధ్వర్యంలో గురువారం ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో స్థితిగతులపై సమావేశం నిర్వహించారు. సెక్టార్ అధికారులు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లకు జిల్లా ఎన్నికల అధికారి పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళి మేరకు అందరూ నడుచుకోవాలన్నారు. సమావేశంలో డిటి మల్లేష్ ప్రసాద్, సెక్టార్ అధికారులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతిపై విచారణ

పుట్లూరు : మండలంలోని బాలాపురం పంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరిగింద ని గత నెల 29వ తేదీ పి.చింతలపల్లికి చెందిన వెంకట సుదర్శన్‌రెడ్డి కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గురువారం ఎపిడి వెంకటరత్నం ఎంపిడిఒ కార్యాలయంలో విచారణ చేపట్టా రు. విచారణకు పనిచేసిన వారు కాకుండా తల్లిదండ్రులు రావడంతో ఎపిడిఒ ఫిర్యాదులో పేర్లు ఉన్న వారు మాత్రమే కార్యాలయంలో ఉండాలని, ఇతరులు వెళ్లిపోవాలని సూచించారు. అనంతరం ఒకరి ఇద్దరితో స్టేట్‌మెంట్ రాయించుకొని వెళ్లారు.

ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌పై అవగాహన

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం విఎం. సుబహాన్ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌పై అవగాహ న కల్పించారు. ముందుగా పాఠశాల నుంచి గాంధీ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అయ్యప్ప బేకరీ నిర్వాహకుడు కేక్, బ్రెడ్ తయారీ విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. హెచ్‌ఎం సుబహాన, టైమ్స్ సెంటర్ ఫర్ లర్నింగ్ లిమిటెడ్ ఒకేషనల్ ట్రైనర్ మంజుభార్గవి మాట్లాడుతూ ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్ వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

రైతుపై హిజ్రాల దాడి

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ రైతుపై హిజ్రాలు దాడి చేసిన ఘటన కళ్యాణదుర్గం సమీపంలోని మల్లాపురం ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గం మండలం తిమ్మగానిపల్లి గ్రామానికి చెందిన చిత్తప్పపై గురువారం మధ్యాహ్నం కళ్యాణదుర్గం పట్టణం నుంచి ద్విచక్ర వాహనంలో ఆయన స్వగ్రామానికి వెళ్తున్నాడు. మల్లాపురం బైపాస్ రహదారి వద్ద హిజ్రాలు ఆయన్ను ఆపారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు చిత్తప్ప డబ్బు ఇచ్చినా, ఇంకొంచెం కావాలని వేధించారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, బైక్ తాళాలను లాక్కున్నారు. దీంతో చిత్తప్ప ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇద్దరు హిజ్రాలు కర్రలతో అతనిపై దాడి చేశారు. కర్రతో చిత్తప్ప తలపై కొట్టడంతో రక్తగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఆయన్ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ హరినాథ్ తెలిపారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్ రెవెన్యూ విభాగం సిబ్బందిని ఆదేశించారు. నగరంలో ఇంటి, నీటి పన్ను డిమాండ్, కలెక్షన్స్, అరియర్స్, తదితర వివరాలపై కమిషనర్ గురువారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. టవర్ క్లాక్ కూడలిలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో షాపుల వివరాలు తెలుసుకున్నారు. అక్కడి పరిస్థితులు, నిర్వహణ లోపాలు తన దృష్టికి వచ్చాయని, వెంటనే వాటిని సరి చేయాలన్నారు. బకాయిల వివరాలను అందించాలని, త్వరలో కాంప్లెక్స్‌ను పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రజలు నుంచి అందే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలన్నారు. గతేడాదితో పోలిస్తే పన్ను వసూళ్లు చాలా తక్కువగా ఉండడంతో అడ్మిన్ కార్యదర్శులు, ఆర్‌ఐల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్లు సతీష్‌కుమార్, సుజాత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మురళి, ఎస్‌ఆర్.బాబు, పద్మలత పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్

'పాలవెల్లువ' పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-నార్పల

ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ రాముడు 'జగనన్న పాలవెల్లువ' పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన మహిళా డెయిరీ సహకార సంఘం ప్రమోటర్లు కచ్చితంగా పాల కేంద్రానికి పాలు పోయిస్తూ, ఇతర మహిళా పాడి రైతులు కూడా పాలు పోసేలా ప్రోత్సహించాలన్నారు. రోజూ కనీసం 160 లీటర్లకు తగ్గకుండా పాలు సేకరించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించ ని పాలను తిరస్కరించాలన్నారు. పాల కేంద్రంలో సమస్య తలెత్తితే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజ రాణి, వెటర్నరీ డిసిఒ ప్రభాకర్‌రెడ్డి, రూట్ ఆఫీసర్స్ మారుతి, సుధీర్, వెటర్నరీ డాక్టర్ రాధిక, ఎపిఎం తిప్పమ్మ, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీదేవి, వరలక్ష్మి, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున, వహీద, సిసిలు రామకృష్ణ, రామచంద్ర, సరస్వతి,పాల్గొన్నారు.

బుగ్గన బడ్జెట్ అంకెల గారడీ : ఆలం

ప్రజాశక్తి-నార్పల

అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ మొత్తం అంకెల గారడీనే అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బడ్జెట్ అంచనా కొండంత ఖర్చులు పిసరంత అన్నారు. రూ. 13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ. 44 వేల కోట్లకు, రూ. 35వేల కోట్ల ద్రవ్యలోటును రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదే అన్నారు. బడ్జెట్‌లో పన్నుల బాదుడు తప్ప కొత్త అంశాలేవీ లేవన్నారు. టిడిపి హయాంలో తీసుకున్న దాని కంటే 4 రెట్ల అప్పులు చేసి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. జగన్ అండ్ కో తీసుకొచ్చిన ప్రతీ స్కీం ఓ స్కాంలా మారిందన్నారు.

ఆలం నరసానాయుడు

టిడిపి శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే సమావేశం

పామిడి : మాజీ ఎమ్మెల్యే ఆర్. జితేంద్రగౌడ్ గురువారం పట్టణంలో పర్యటించి టిడిపి సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. రాబోయే ఎన్నికలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. అనంతరం మెయిన్ బజార్ లో ఉన్న ప్రముఖులు, వ్యాపారులను కలిసి టిడిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జింకల రామకృష్ణ, వడ్డే శివకుమార్, ఎంహెచ్.లక్ష్మినారాయణరెడ్డి, గౌస్ పీరా, ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాసులురెడ్డి, బొమ్మ మోహన్, జింకల సంజీవ, కరూర్ శివ, మాలిక్, బాషా, రమణరావు, వెంకట రమణ, నాగార్జున, శ్రీరాములు, దాదా, రఫీ, పల్లె శ్రీనివాసులు, వెంకటేష్, వన్నూరు, దాసు, సురేంద్ర, మహానంద, రవినాథ్‌గౌడ్, వెంకటప్ప, నారాయణ, ఓబులేసు, వలిపి రామాంజనేయులు, కేశప్ప, హనుమంతు పాల్గొన్నారు.

పార్టీ నాయకులతో సమావేశమైన జితేంద్రగౌడ్

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విస్మరించిన సిఎం జగన్

అనంతపురం కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వంలోకి విలీనం చేసుకుంటామని చెప్పి పర్మినెంట్ చేయకపోవడం దారుణమని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మినరసింహులు విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సిఎం జగన్ అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేరు కాదు అని వారిని ప్రభుత్వంలోకి విలీనం చేస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2 లక్షల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు టిడిపి అండగా ఉంటుందన్నారు. వైసిపి ప్రభుత్వం ఆప్కాస్ తెచ్చి అవస్థలు తెచ్చిందన్నారు. మోసం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపికపై హర్షం

కళ్యాణదుర్గం : రాష్ట్రస్థాయి హాకీ క్రీడల్లో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని ఎస్‌ఎల్‌ఎన్ చరిత హాకీ క్లబ్ అధ్యక్షులు గొల్ల సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ సురేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ రాణించి ఈ ప్రాంతానికి గుర్తింపు తెస్తున్నారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు కిరణ్, చరణ్, వరుణ్, నందకిషోర్, రాహుల్, ఆనందప్పగారి చరణ్, బాలికల విభాగంలో భవ్య తేజలను అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఐ జగదీష్, కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో క్లబ్ సభ్యులు

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుత్తి : మండలంలోని లచ్చానుపల్లి గ్రామం వద్ద 10 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. లచ్చానుపల్లి గ్రామానికి చెందిన వెంకటమోహన్(37) గత నెల 28వ తేదీ ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన ఉంచి ఫోన్ మాట్లాడుతుండగా వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతడిని అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

నార్పల : స్థానిక చైతన్య కాలనీలో నాగమణి అక్రమంగా నిల్వ ఉంచిన 20 కింటాళ్ల సబ్సిడీ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ సిఐలు శ్రీనివాసులు, రాజశేఖర్ స్వాధీనం చేసుకుని సిఎస్‌డిటి రాజశేఖ ర్‌కు అప్పచెప్పారు. మండలంలో ఎవరైనా సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచితే సమాచారం ఇవ్వాలని కోరారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో, కదిరి
O.S. No. 755/2022
Between:
పి.షాహిన్ సుల్తానా W/o పి.బహద్దూర్ ఖాన్, Residing at D.No:54, 16 th Cross, లక్కసంద్ర, అడిగొడి పోస్ట్, బెంగుళూరు టౌన్ కర్ణాటక రాష్ట్రము ...**Plaintiff**
మరియు
పి.మహబూబ్ బాషా S/o పఠాన్ దస్తగిరి, Residing at D.No:18-1-235, వేణుగోపాల్ నగర్, అనంతపురం పట్టణము మరియు జిల్లా. ...**Defendants**
పై దావాలోని ప్రతివాదికి దావా సమన్లు
పై దావాలోని వాది (పి.షాహిన్ సుల్తానా) ప్రతివాది అయినా మీ పైన Perminent injunction దావాను పై కోర్టులో వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 28/02/2024 తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 28/02/2024 వ తేది ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:28/02/2024
స్థలం:కదిరి
జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్.,
వాదితరుపు వకీలు, కదిరి.